


# లివింగ్ టుగెదర్

సాహితి (ఎస్. శ్రీదేవి)

టప్మని వానచినుకు మీద పడటంతో మెలకువ వచ్చింది మహతికి. నిద్ర పోవటానికి ముందున్న వాతావరణం ఇప్పుడు లేదు. ఆకాశం నిండా దట్టంగా మబ్బులు కమ్మేసి వున్నాయి.

ఈ క్షణాన్నో మరుక్షణాన్నో కురవనున్న కుంభ వృష్టికి స్వాగతం పలుకుతూ ఎవరో విసుర్తున్న పూ రెక్కల్లా రాలిపడుతున్నాయి ఒకటి రెండు చినుకులు. అలాంటి చినుకే ఒకటి మొహమ్మీద పడటంతో కొద్దిగా కదిలాడు నిశాంత్.

'లేవండి. లోపలికెళ్దాం. వానొచ్చేలా వుంది,' అన బోతున్న మహతి ఆగిపోయింది. అస్పష్టంగా కలవరి స్తున్నాడతను. వినాలని ప్రయత్నించింది.

"ఐ... లవ్... యూ..."

విస్మయం కలిగిందామెకి. పెళ్లైన ఏడెనిమిదేళ్లకి ఇప్పుడే కొత్తగా ప్రేమలో పడ్డట్టు ఎవరితో అంటున్నాడా మాట? ఆ ప్రశ్నకి వెంటనే జవాబు కూడా దొరికింది.

"ఐ మిస్స్‌డ్ యూ సోమచ్... ప్రసన్నా..."

ఆమె నివ్వెరపోయింది.

ప్రసన్న... ప్రసన్న... ఎవరీ ప్రసన్న? సమ్మెట పోటులా వచ్చి తాకుతున్న ప్రశ్న. వాన గురించి మర్చి పోయింది.

దడదడమని ఒక్కసారి వాన మొదలవటంతో చప్పున లేచి కూర్చున్నాడు నిశాంత్. హడావిడిగా పాపనీ, బాబునీ చెరో భుజమ్మీదా వేసుకుని బెడ్‌రూమ్‌లో పడుకోబెట్టి వచ్చాడు. తనతోపాటే లేచి వుంటుందను కున్న మహతి లోపలికి రాకుండా వానలో తడుస్తూ అలాగే కూర్చోవటం ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ప్రసన్న ఎవరు?" అతను దగ్గరికి రాగానే సూటిగా అడిగింది.

షాకయ్యాడతను. పట్టుబడ్డ దొంగలా తలొంచు కోలేదు. ఇరుకున పడ్డట్టు ఉక్కిరిబిక్కిరవలేదు. ఆమె కెలా తెలిసిందీ! అదీ అంత హఠాత్తుగా అని షాక య్యాడు. అంతే!

"మీరిందాకా కలవరించారు. ప్రసన్న ఎవరు?" మళ్లీ అడిగింది.

"లోపలికెళ్లి మాట్లాడుకుందాం పద వానొ స్తోంది," అదేదో మామూలు విషయంలా అన్నాడు. అతని వెంట లోపలికి నడిచింది.

"ప్రసన్న విషయం నేనే చెప్పాలనుకున్నాను. గ్రాడ్యుయేషన్లో నా క్లాస్‌మేట్. ప్రేమించుకున్నాం. చదువయ్యి జాబొచ్చాక పెళ్లి చేసుకోవాలనుకున్నాం. కానీ ఈలోగా వాళ్ల నాన్నగారికి ట్రాన్స్‌ఫరై వేరే వూరు వెళ్లిపోయింది. క్రిందటి నెలలో యూనియన్ కాన్ఫరెన్స్ లో కలిసింది. తను... తనింకా పెళ్లి చేసుకోలేదు," ఆగాడతను. అతని గొంతులో అపరాధ భావన వుంది.

"మీరింకా ఆమెని ప్రేమిస్తున్నారా?" తీవ్రంగా వుంది మహతి స్వరం.

"ఎందుకు ప్రేమించకూడదు?" ఎదురు ప్రశ్నిం చాడతను.

నివ్వెరపోయింది మహతి. తప్పుచేసి సమర్థించు కుంటున్నట్టు లేదతని ధోరణి. అంటే ప్రేమించడం తప్పని కాదు. మనిషి నిరంతర ప్రేమి. ఎవరో ఒకర్ని, దేన్నో ఒకదాన్ని ప్రేమించకుండా బతకలేడు. ఎనిమిది రకాల ప్రేమని నిర్వచిస్తారు. వాలన్‌టైన్స్ డేనాడు ప్రేమికుల మధ్య వుండే ప్రేమ కూడా అందులో ఒకటి. అలాంటి ప్రేమ పెళ్లికి ముందు ప్రేయసి పట్ల వుండచ్చు. పెళ్లయ్యాక మాత్రం భార్య మాత్రమే దానికి అర్హురాలు.

పెళ్లికి ముందు... ఎలాంటి కమిట్‌మెంట్సూ లేనప్పుడు అతను ప్రసన్నని ప్రేమించి వుండచ్చు. అది విఫలమవచ్చు. కానీ పెళ్లైన ఎనిమిదేళ్లకి ఇంత బోల్డ్‌గా అప్పుటెప్పటి ప్రేమనో ప్రకటిస్తూ వుంటే ఆమెకి ఆశ్చర్యం కలుగుతోంది.

''మరి నన్నెందుకు చేసుకున్నారు. మీరూ తన లాగే పెళ్లి చేసుకోకుండా వుండిపోవల్సింది,'' అంది ఉక్రోషం తన్నుకొస్తుంటే.

''నిజమే!'' ఒప్పుకున్నాడు. ''తనూ నాలాగే ఎడ్జె స్టయిపోయి వుంటుందనుకున్నాను.''

అతనంత నిస్సంకోచంగా చెప్తుంటే ఏం చెయ్యాలో తెలీడంలేదు మహతికి. అవమానంగా అనిపిస్తోంది. అతను పడాల్సిన యిబ్బందిని తను పడుతోంది.

''మేమొక నిర్ణయానికొచ్చాం.''

మహతి మాట్లాడలేదు. అతను చెప్పింది వినటం మినహా మరో ఛాయిస్ లేదని అర్థమైంది. నిజమే! కాన్ఫరెన్స్ నుంచి తిరిగొచ్చాక అతన్లో సునిశితమైన మార్పు కనిపించింది. దాన్ని తను గుర్తించింది. కానీ పని వత్తిడి వలన పెద్దగా పట్టించుకోలేదు. అదీగాక అప్పుడప్పుడతను మూడీగా వుంటాడు. అది కూడా ఒక కారణమనుకుంది. కానీ అతని లోలోపల లావాలా కుతకుత ఉడుకుతోందనీ అదెప్పుడో బహిర్గతమవుతుందనీ వూహించలేదు.

''నీకూ పిల్లలకీ నేను అన్యాయం చెయ్యను,'' అతను చెప్పబోతున్నదేమిటో అర్థమైంది మహతికి. ముఖం ఎర్రబడింది.

''నిజానికి నువ్వూ పిల్లలూ నా జీవితంలో భాగమైపోయారు. వీ కెనాట్ బీ సెపరేటెడ్''

''...''

''ప్రసన్న పెళ్లి చేసుకోకుండా అలాగే వుండిపోతుందట. అది నేను తట్టుకోలేను.''

''...''

''మేం కలిసి వుండాలనుకుంటున్నాం. జస్ట్ లివింగ్ టుగెదర్''

''అంటే?!'' వెంటనే రియాక్టయింది మహతి.

''తనకి పెళ్లీ, పిల్లలూ ఏవీ అవసరం లేదు. నా కంపెనీ చాలు. నువ్వు... నువ్వొప్పుకుంటే సైలెంట్‌గా జరిగిపోతుందీ విషయం. లేకపోతే నేనే తన దగ్గరికి వెళ్లిపోతాను. ఆలోచించుకుని ఏం చేస్తే బాగుంటుందో నువ్వే చెప్పు,'' అతను బెడ్‌రూమ్‌లోకి వెళ్లిపోయాడు. అతనున్నచోటికి వెళ్లడానికి మొదటిసారి సంకోచం కలిగింది మహతికి.

సోఫాలో అలాగే పడుకుంది. చాలా నిస్త్రాణగా వుంది. పొద్దున్న తొమ్మిదిన్నర నుంచీ సాయంత్రం ఐదున్నరదాకా ఆఫీసులో ఎకౌంట్స్ చూసి ఇంటా బయటా ఎన్నో సమస్యల్ని ఎంతో తెలివిగా పరిష్కరించే ఆమె మెదడు ప్రస్తుతపు ఈ సమస్య విషయానికొచ్చేసరికి తన నియంత్రణ కోల్పోయింది. ఆలోచనలు గడ్డకట్టుకుపోయినట్టయి సీలింగ్‌కేసి చూస్తూ వుండిపోయింది. ఏ తెల్లవారుజామునో నిద్రలోకి జారుకుంది.

ఎంతో విరక్తిగా అనిపించింది లేచాక. అప్పటికే నిశాంత్, పిల్లలూ లేచారు. వంట రెడీ పిల్లలూ రెడీ. నిరాసక్తంగా తన పనులు చేసుకుపోయింది.

పిల్లల్ని స్కూల్లో దింపి వచ్చాడు నిశాంత్. మహతి మొహంలో పరుచుకున్న ఉదాసీనత చూస్తూ ఆమెని మాట్లాడించే సాహసం చెయ్యలేకపోయాడు. ఆఫీసుకి వెళ్లిపోయాడు.

*

''గతించిన ఏవో జన్మల్లో మనం ప్రేమికులం. మన ఆత్మలు ఆ శరీరాల నుంచి విడిపోయాక కూడా మనం ప్రేమికులమే. ఒకరికోసం ఒకరం తపించిపోతూ జన్మాంతరాల నుంచీ వెతుక్కుంటూ ఇప్పటికిలా కలుసుకున్నాం.''

''నీకివ్వగలిగిన కానుక ఏముందాని ప్రపంచమంతా గాలించాను కానీ దొరకలేదు. నిరాశ నిండిన మనసుతో నా ఖాళీచేతుల్ని చూసుకుంటుంటే అప్పుడర్థమైంది- నా హృదయం తప్ప అంతదద్భుతమైనది మరొకటి లేదనీ, అదిప్పటికే నిన్ను చేరుకుందనీ.''

''ప్రేమ కోసం చరిత్రలో యుద్ధాలెన్నో జరిగాయి. నిన్ను గెలుచుకోవాలంటే నేనెవరితో యుద్ధం చెయ్యాలి...?''

''ప్రేమ అనే కీకారణ్యంలో ఇరుక్కుపోయి దారి దొరక్క కొట్టుకుంటున్నాను. నీ చెయ్యందించి దారి చూపవూ...?''

కాలేజీ రోజులప్పటి ప్రేమలేఖల్ని చదువుతోంది ప్రసన్న. ఆమె మనసు సముద్ర కెరటంలా వువ్వెత్తున ఎగిసిపడ్తోంది. ఎంత భావుకుడతను!

కాలేజీ రోజుల్లో ఇద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఇంతలో తండ్రికి ట్రాన్స్‌ఫరైపోయి వేరే వూరు వెళ్లారు. ఇద్దరూ ఒకర్నొకరు మర్చిపోలేదు. క్రమం తప్పకుండా ఉత్తరాలు రాసుకొనేవారు. తను క్లుప్తంగా రాస్తే అతను మాత్రం అందమైన ప్రేమలేఖల్ని రాసేవాడు. అతని ఉత్తరాలని చదువుతూ తండ్రికి దొరికిపోయింది.

అందరు తండ్రుల్లా ఆయన తనని తిట్టలేదు. తప్పుపట్టలేదు. అలాగని యస్ కూడా చెప్పలేదు. ఇంతలో అనూహ్యమైన ఓ సంఘటన జరిగిపోయింది.

మేనత్త చనిపోయిందని టెలిగ్రామ్ వచ్చింది.

డౌరీ డెత్! ఏడేళ్లపాటు అత్తింట్లో నరకం అనుభవించి ఆఖరికి వంటి మీద కిరసనాయిలు పోసుకుని కాల్చుకుని చచ్చిపోయింది. చావాలంటే ఎన్నో తేలికైన మార్గాలుంటాయి. కానీ అనుభవాలు అలాంటి చావునే కోరుకుంటాయేమో!

వళ్లంతా కాలి మసిబొగ్గులాగైపోయిన ఆమె తన తండ్రికి ఆఖరి చెల్లెలు. ప్రాణప్రదంగా ప్రేమించేవాడు. ఆమెకి అత్తవారింట్లో అన్ని కష్టాలున్నాయని ఎవరికీ తెలీదు. ఆడపిల్లలు పెళ్లి అనేదాన్ని ఎంత పొసెసివ్‌గా తీసుకుంటారంటే పుట్టింట మరణించి అత్తింట్లో పునర్జన్మించామన్నంత బలమైన విశ్వాసం ఏర్పడి భర్త తిట్టినా కొట్టినా బైటపెడితే పోయేది తమ పరువేనను కుంటారు. ఆమె భర్త గురించి ఏమీ చెప్పకుండా దాచి పెట్టింది.

"నాకు... నాకెందుకు చెప్పలేదు, శైల గురించి? ఇంతదాకా ఎలా రానిచ్చారు?" తన తండ్రి ఆవేదనతో తాతగారి నడిగితే-

"నాకు మాత్రం ఏం తెలుసురా? పిల్ల నవ్వుతూ తిరుగుతుంటే అది సుఖంగానే వుందనుకున్నాను. ఆఖరిపిల్లని అందరికన్నా దానికే ఎక్కువ పెట్టాను," అని తాతగారు ఏడ్చారు. బామ్మ సరేసరి! పోలీసుకేసు పెట్టారు మేనత్త అత్తవారి మీద.

"ఎందుకురా, నలుగుల్లో అల్లరవడం తప్పించి నా కూతురు తిరిగొస్తుందా? వాడి పాపానికి వాడే పోతాడు," అంది బామ్మ.

"తప్పుని దాస్తే దాగదమ్మా! నిప్పులా నిశ్శబ్దంగా కాలుస్తుంది. వాడి తప్పుని నలుగురికీ తెలిసేట్లు చెయ్యకపోతే శైలజలా మరో ఆడపిల్ల బలైపోతుంది," అన్నాడు తండ్రి కఠినంగా.

తనలో పెళ్లంటే ఏమిటనే విశ్లేషణ మొదలైంది. మగవాడు శారీరకంగానూ, సామాజికంగానూ బలవంతుడు. ఆ బలం అతన్లో ఒక పాశవిక ప్రవృత్తిని సృష్టించింది. అతని మృగప్రవృత్తిని ప్రకటించుకోవడానికి ఒక టార్గెట్ కావాలి. ఆ టార్గెట్ స్త్రీ. పెళ్లి అనే ట్రాప్‌లోకి ఆమెని లాగి, ఆమెని మానసికంగానూ, సామాజికంగానూ బలహీనపరుస్తూ ఆనందాన్ని పొందుతాడు. ఈ రకమైన ఆలోచనలు తనలో పెళ్లి పట్ల విముఖతని పెంచాయి. నిశాంత్ ఫేడౌటయి సబ్‌కాన్షస్ మైండ్‌లోకి వెళ్లిపోయాడు.

తను పెళ్లి చేసుకోదు. మగవాడికి టార్గెట్ కాదు. పిల్లల్ని కూడా కనదు. పిల్లల్ని కంటే అక్కడ సెంటిమెంట్స్ వర్కౌట్ అవుతాయేమో! చుట్టూ ఎన్నో జీవితాలు. వాటితో ముడిపడిన ఎన్నో సమస్యలు తనింటిని కేంద్రంగా తీసుకుంటే ఎంతో దూరం దాకా విస్తరించిన భూ ప్రకంపనాలు.

తండ్రి, మేనత్త భర్తని చాలా డీఫేమ్ చేశాడు. అందలం ఎక్కించి చెల్లెలి పక్కన కూర్చోబెట్టిన చేత్తోనే కిందికి తోసేశాడు. తామిచ్చినదంతా వెనక్కి తీసుకుని ఛారిటీహోమ్స్‌కి ఇచ్చేశారు. అతని ఉద్యోగం పోయింది. జైలు కెళ్లాడు. ఇంతా జరిగాక మిగిలినది ఒకటే ప్రశ్న- వాళ్లకి పిల్లలుంటే ఇదంతా జరిగేదా అని. అప్పుడొక దోషిని శిక్షించడం కన్నా ఆ పిల్లలు అనాథలవకుండా చూడటం ముఖ్య విషయమయ్యేది.

స్త్రీల అణచివేత ఒక్క ఇండియాలోనే వుందా? అమెరికా, ఇంగ్లాండ్... ఏదీ మినహాయింపు కాదు. ఒక శతాబ్దం క్రితందాకా ఇంగ్లాండ్‌లో విమెన్ ఫ్రాంఛైజ్ లేదు. అమెరికాలో ఎన్నో వివాహాలు విఫలమయ్యి స్త్రీ పురుష సమానతావాదానికీ, స్త్రీ స్వేచ్ఛకీ పెట్టుకున్న దరఖాస్తుల్లా ఎన్నో జీవితాలు...

కాలింగ్‌బెల్ మోగేసరికి ఉలిక్కిపడింది ప్రసన్న. లెటర్స్ అన్నీ సర్దేసి వెళ్లి డోర్ తీసింది.

ఎదురుగా మహతి.

నిశాంత్ దగ్గర ఆమె ఫోటోని చూసింది ప్రసన్న. ఎందుకొచ్చింది? నేరుగా తన దగ్గరకి? ఆలోచిస్తూనే,

"రండి..." అని ఆహ్వానించింది.

"అయాం మహతి. కమర్షియల్ టాక్స్‌లో చేస్తున్నాను. నిశాంత్ వైఫ్‌ని," క్లుప్తంగా పరిచయం చేసుకుంది మహతి.

"తెలుసు," చిరునవ్వుతో చెప్పింది ప్రసన్న.

"నా గురించి నిశాంత్ చెప్పాడా?" అడిగింది

అన్నీ తెలుసుకుని ఆమె వచ్చిన పర్పసేమిటి? తనని కన్విన్స్ చెయ్యటమా? నిశ్శబ్దంగా వెళ్లి ఫ్రిజ్‌లోంచి రెండు కూల్‌డ్రింక్స్ తీసుకొచ్చి ఒకటి ఆమెకిచ్చి మరొకటి తను తీసుకుంది. ఇద్దరూ సిప్ చేస్తున్నారు. సడెన్‌గా బరస్టయింది మహతి.

"నిశాంత్‌ని ట్రాప్ చెయ్యటంలో నీ ఉద్దేశం ఏమిటి? చదువులోపడి నిర్లక్ష్యం చెయ్యటంతోనో, కట్నాలు ఇవ్వలేకనో, సంపాదించే ఆడపిల్లలైతే తల్లిదండ్రుల స్వార్థం చేతనో ఈ రోజుల్లో ఆడపిల్లలకి పెళ్లిళ్లు అవటం కష్టమవుతోందనే విషయం నాకు తెలుసు. భార్యాపిల్లలు గల మగవాడిని ట్రాప్ చెయ్యటమనేది ఆ సమస్యకి పరిష్కారం కాదు. హై సొసైటీ క్లబ్స్

ఏవో వుంటాయట. అక్కడికెళ్లి నచ్చినవాడితో స్పెండ్ చేసి రావటం బెటరు. నేనేం చెప్తున్నానో నీకర్థమైందను కుంటాను" కఠినంగా అనేసి, చేతిలోని బాటిల్ టక్‌మని శబ్దం వచ్చేలా టీపాయ్ మీద పెట్టేసి లేచి నిలబడింది.

ప్రసన్న ముఖంలోకి వెచ్చటి రక్తం జరజర పాకింది. ఏమనుకుంటోందీమె తనని? తనకీ నిశాంత్‌కీ మధ్యనున్న ఎఫేర్‌ని? ఏమన్నాడు నిశాంత్ తనతో...?

"నువ్వో దగ్ధమవుతున్న పూలతోటవి. శైలజగారి చావు నీలోని భావ సౌకుమార్యాన్ని దహించివేస్తోంది. నిన్నిలాగే వదిలేస్తే ఏమవుతావో తెలీదు," అంటూ వాన జల్లులా తనని అల్లుకుని చల్లబరిచాడు. అప్పటిదాకా మగవాళ్లని ద్వేషిస్తూ వున్న తనకి హఠాత్తుగా గుర్తొచ్చింది. సమాజంలో వుండేది తన మేనత్త భర్త ఒకడే కాదు. తండ్రి, తాత, నిశాంత్, వీళ్లంతా కూడా మగవాళ్లేనని. నిశాంత్‌కి దూరమై ఎంత పొరపాటు చేసిందో అర్థమై ఆ ఉద్వేగం తనని ఊపేస్తున్న క్షణంలోనే మరొకటి కూడా అర్థమైంది. తామిద్దరూ కలుసుకోలేనంత దూరంలో వున్నారని.

ఎలా? అతను లేకుండా బతకడమెలా? అనే ప్రశ్న జీవన్మరణ సమస్యలా కుదిపేస్తుంటే తోచిన ప్రత్యామ్నాయం... లివింగ్ టు గెదర్. పెళ్లి, పిల్లలాంటి బాధ్యతలేవీ లేకుండా కలిసుండటం. ఇమోషనల్ షేరింగ్. దానివలన అతని భార్యాపిల్లలకేం నష్టం వుండదు. తనకి లీగల్ స్టేటస్ అక్కర్లేదు. అలాంటప్పుడు ఆమెకేం ప్రాబ్లమ్? ఆమె హక్కులని తనేం కొల్లగొట్టనప్పుడు? మనిషి ప్రేమించడానికేం? ఎందర్నైనా ప్రేమించవచ్చు. ప్రేమకి హద్దులేం వుంటాయి?

"గుడ్‌బై... గుడ్‌బై ఫరెవర్," ఆమెనలాగే ఆలోచనల్లో వదిలేసి విసురుగా ఇంటికొచ్చేసింది మహతి.

నిన్నటిదాకా తనవేననిపించిన ఆ ఇల్లూ, వాతావరణం ఎంతో అప్రియంగా తోచాయి. తాళం తీసుకుని లోపలికి వెళ్లగానే చేసిన మొదటిపని ఆఫీసుకి ఫోన్ చేసి చెప్పటం తనారోజు రావటం లేదని. లేకపోతే వున్న తలనొప్పికి కొత్త సమస్యలు తోడవుతాయి. అంతేకాదు, తను వెళ్లలేని పరిస్థితుల్లో వున్నప్పుడు తెలియపరచటం కనీస బాధ్యత. వాళ్లు వేరే ఎరేంజిమెంట్ చేసుకుంటారు. ఆఫీసరు ఒక వ్యక్తిగా కింది ఉద్యోగి సమస్యలని అర్థం చేసుకోగలడుగానీ ఒక వ్యవస్థగా అతనికి వాటితో సంబంధం లేదు. ఏ సీట్లోనూ పని ఆగకుండా చూసుకోవాలి. అంతే!

మరో అరగంటకి నిశాంత్ వచ్చాడు. మహతి తనింటికి వచ్చి వెళ్లినట్టు ప్రసన్న అతనికి ఫోన్ చేసి చెప్పింది. "నా గురించి చాలా నీచంగా మాట్లాడింది. నేనసలు నీ నుంచి ఆశించినదేమిటి? ఫ్రెండ్‌షిప్. జస్ట్ ఫ్రెండ్లీ కన్సర్న్..." ఫోన్లో చెప్తుండగానే ఆమె కళ్లనీళ్ల పర్యంతమైంది. నిశాంత్ ముందు అక్కడికే వెళ్లాడు. ఆమెని ఓదార్చాడు.

"మొదట్లో కదా, అలాగే అనిపిస్తుంది. తనకెలాంటి అన్యాయం జరగదనే విషయం అర్థమయ్యాక అప్పుడు తనకే తెలుస్తుంది," అని చెప్పి, మహతి దగ్గరకొచ్చాడు.

*

అతనికి ఇద్దరూ ముఖ్యమే. కానీ ప్రసన్న పరిస్థితి కొంత డెలికేట్‌గా ఉంది. ఆమెనలాంటి స్థితిలోకి నెట్టేసిన తనమీద తనకే కోపమొస్తోంది. ట్రాన్స్‌ఫరై వెళ్లిపోయాక దాదాపు సంవత్సరంపాటు రెగ్యులర్‌గా లెటర్స్ రాసుకున్నారు. ఆ తర్వాత సడెన్‌గా ఆమె లెటర్స్ రాయటం మానేసింది. పెద్దవాళ్లుగానీ బలవంతంగా పెళ్లి చేశారేమోననుకున్నాడు తను. అంతకన్నా వేరే కారణం కనిపించలేదు. వెళ్లి కలుద్దామనుకున్నాడు. అలా చెయ్యటం ఆమెని డిస్టర్బ్ చెయ్యటమవుతుందని భావించి వూరుకున్నాడు. ఎంత ఫూల్ తను! ఒక్కసారి వెళ్లి వుంటే ఈ రోజున ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదనిపించింది.

అతనొచ్చేసరికి మహతి సోఫా బ్యాక్ మీద తల ఆనించి, కాళ్లు టీపాయ్ మీద వుంచి సుదీర్ఘమైన ఆలోచనలో నిమగ్నమై వుంది. అతనికి గిల్టీగా అనిపించింది. దగ్గరగా వెళ్లి భుజం మీద చెయ్యి వేశాడు. ఆ స్పర్శకి ఉలిక్కిపడి తల తిప్పిన ఆమె నెమ్మదిగా అతని చేతిని తొలగించి సరిగా కూర్చుంది.

"ప్రసన్న దగ్గరికి ఎందుకెళ్లావు?" మృదువుగానే అడిగాడు. అతనికి ఆమెతో దెబ్బలాడాలని లేదు. సామరస్యంగా నచ్చజెప్పి ఒప్పించాలనే వుంది.

"నేనొచ్చినట్టు చెప్పిన వ్యక్తి, ఎందుకెళ్లానో, ఏమన్నానో చెప్పలేదా?"

"అలా మాట్లాడవచ్చా? చాలా హర్టయింది తను."

"చేసే పనులు అలాంటివైనప్పుడు... అలాగే మాట్లాడతారు. ఈరోజు నేనన్నాను. రేపట్నుంచీ చుట్టూ వున్నవాళ్లు అంటారు. పడాలి. తప్పదు."

"అందరికీ నీలా అమరిన జీవితం వుంటుందా?"

"అలా అమరకపోవటంలో నా తప్పేమైనా వుందా?"

"మూర్ఖంగా వాదించకు. అవతలి వ్యక్తి సమస్యని అర్థం చేసుకోవేంటి? నువ్వేం చిన్నపిల్లవు కావు," చిరాగ్గా అన్నాడు.

"నాకా అవసరం లేదు."

''ఆమె నా కోసం పెళ్లి మానేసింది.''

''దానికి నా బాధ్యత లేదు.''

''నువ్వింత మూర్ఖంగా మాట్లాడుతున్నావు కాబట్టే నేనూ కఠినంగా చెప్పాల్సొస్తోంది మహతీ! విను. నీకిష్టమైనా లేకపోయినా నేను ప్రసన్నని దూరం చేసుకునే ప్రసక్తి లేదు. నీ లిమిట్స్‌లో నువ్వుంటే మంచిది. యస్... మరోసారి తనని కలిసినా, ఇలా మాట్లాడినా నేనూరుకోను. అర్థమైందా? నీకేదేనా కోపం వుంటే నన్నను. అంతే.''

అతనికేసి నిశితంగా చూసింది మహతి. మగవాడు ఎంతలో రంగులు మార్చగలడు? తనే ప్రాణమన్నట్టు ఎనిమిదేళ్లు గడిపిన వ్యక్తి. ఇంతలో ఎంతగా మారిపోయాడు. తల్లి, చెల్లి, ఆఫీస్‌లోని లేడీ కొలీగ్, పెళ్లికి పూర్వపు గర్ల్‌ఫ్రెండ్... అందరూ ముఖ్యమైనవాళ్లే మగవాళ్లకి- భార్య తప్ప. అయినా ఆమె తనకి ఫెయిత్‌ఫుల్‌గా వుండాలని ఆశిస్తాడు. అది తెలివితక్కువతనం అనాలో అహంభావమనాలో అర్థమవలేదు.

''అదే మీ ఫైనల్ డెసిషనా?'' అడిగింది.

అతను జవాబివ్వలేదు. సుదీర్ఘంగా నిశ్వసించింది మహతి.

''మనం వెడ్‌లాక్ బ్రేక్ చేసుకుందాం,'' తనే జవాబు చెప్పింది. అదే ఆమె నిర్ణయం కూడా.

''అంటే?!'' అతని భృకుటి ముడిపడింది.

''పెళ్లి అనే ఈ పంజరాన్ని పగలగొట్టుకుని ఎవరి దారిన వాళ్లం వెళ్లిపోదాం.''

''పిల్లలు?''

''హాస్టల్లో వేస్తే వాళ్లే చదువుకుంటారు.''

''నువ్వు మళ్లీ పెళ్లి చేసుకుంటావా?''

''ఆలోచిస్తాను.''

''ఇద్దరు పిల్లల తల్లివి.''

''అదే ఇద్దరు పిల్లల తండ్రినైతే కచ్చితంగా చేసుకుంటానని చెప్పగలిగేదాన్ని.''

''ఆ పెళ్లిలో నీకు సంతోషం వుంటుందనే అనుకున్నావా?''

''చేసుకుంటానని అనలేదే? ముందు నాకు స్వేచ్ఛ కావాలి. నువ్వు ఎగిరిపోయాక ఇంకా నేను పంజరంలోనే వుండాలనుకోవడంలేదు.''

అతనికి మహతి మానసిక పరిస్థితి మీద అనుమానం కలిగింది. జాలేసింది. ఉక్రోషంలో అలా మాట్లాడుతోందనుకున్నాడు. చల్లారితే వివేచన అదే మేల్కొంటుందనిపించింది.

''అన్నం తిందామా? నేనూ తినలేదు,'' మాట మార్చాడు.

''నాకు తినాలని లేదు.''

''అన్నం మీద అలిగితే ప్రాబ్లమ్స్ సాల్వ్ అవుతాయా? నువ్వు సమస్య అనుకుంటుంది అసలు లేనే లేదు. చిన్న ఎడ్జెస్ట్‌మెంట్. నేను ప్రసన్నని పెళ్లి చేసుకోను. తనకి హక్కులేమీ అక్కర్లేదు. జస్ట్... నా కంపెనీ ఆశిస్తోంది. అంతే. నీ తర్వాతే ఎవరేనా,'' మెత్తగా అన్నాడు.

''ఉంచుకున్నదానికి హక్కులేం వుండవనేదొక గొప్ప విషయంలా చెప్పక్కర్లేదు. మీరిద్దరూ పెళ్లి చేసుకుంటే దాని పర్యవసానం ఎలా వుంటుందో తెలీనంత మూర్ఖురాలనీ నేననుకోవటం లేదు,'' ఠపీమని అనేసి అక్కణ్ణుంచి లేచి వెళ్లిపోయింది మహతి.

అతని సహనానికి అది ఆఖరి హద్దయింది.

''స్టుపిడ్!'' బైటికే కసిగా అని విసురుగా వెళ్లిపోయాడు. ఆ వెళ్లటం ప్రసన్న ఇంటికి.

*

రెండు రోజులైంది నిశాంత్ ఇంటికొచ్చి. కావాలనే వెళ్లలేదు. మహతి తన మీద ఎంతగా డిపెండ్ అయి వుందో తెలుసు తనకి. పొద్దున్నే కూరగాయలు కట్ చేసివ్వటం, పిల్లల చేత చదివించటం, వాళ్లని తయారు చెయ్యటం, స్కూల్లో దించటం, మళ్లీ వచ్చి ఆమెని పికప్ చేసుకోవటం. కనీసం ఆ టైమ్‌లోనైనా, ఆ పనులు చేసుకుంటున్నప్పుడేనా ఆమెకి తనని మిస్ చేసిన ఫీలింగ్ కలుగుతుందని ఆశించే వెళ్లలేదు.

ఈలోగా ఇద్దరూ ఫోన్‌లో మరోసారి దెబ్బలాడుకున్నారు. ''ప్రసన్నని నా ఫ్రెండని ఎందుకనుకోవు? ఎవరి పర్సనల్ లైఫ్ వాళ్లదిగానే వుంచుతాను. మెడిల్ చెయ్యను,'' అన్నాడు నిశాంత్.

''ఆమెపట్ల నీకలాంటి భావనే వుంటే చెప్పు. నీ వెనక నేనూ నిలబడి ఆమెకెలాంటి హెల్ప్ కావాలన్నా చేస్తాను. అంతేగానీ నన్ను బ్లఫ్ చెయ్యద్దు,'' తెగేసి చెప్పింది మహతి.

''ఆమెకి నా పట్ల చాలా చీప్ వొపినీయన్ వుంది. ఆమె కన్విన్స్ అవనంతవరకూ అది ఎలైవ్‌గా వున్నట్టే లెక్క. దయచేసి ఆమె అభిప్రాయాన్ని మార్చే ప్రయత్నం చెయ్యి నిశాంత్. నేనసలు నిన్నెందుకు దూరం చేసుకున్నానో నాకే అర్థమవటంలేదు. ఇప్పుడింత దగ్గరయ్యాక మళ్లీ ఎలా దూరమవను?'' అంది ప్రసన్న బాధపడ్తూ.

ఇద్దరి మధ్యా నలిగాడు నిశాంత్. కొంత సంఘర్షణ. వొరిపిడి... పిల్లలు గుర్తొచ్చారు. ఇంక ఆగలేకపోయాడు. అతను వెళ్లేసరికి మహతి ఇంట్లోనే వుంది. హాల్లో కూర్చుని ఏదో చదువుకుంటోంది. చుట్టూ

రకరకాల పుస్తకాలు ఇర్రెగ్యులర్‌గా వున్నాయి. ఆరోజు దాకా ఆఫీసుకి వెళ్లనట్టుంది.

అతని రాకని గుర్తించనట్టే వూరుకుంది. అతని కది తనిల్లో పరాయిల్లో అర్థమవనంత ఇబ్బందని పించింది. దాన్ని దిగమింగి సోఫాలో కూర్చుని షూ విప్పు కున్నాడు. వాటిని స్టాండు మీద పెట్టేటప్పుడు చిన్నగా శబ్దం చేశాడు. మహతి చిరాగ్గా కళ్లెత్తి చూసి మళ్లీ పుస్తకం లో లీనమైపోయింది. అతనికి అవమానంగా అనిపిం చింది.

విసురుగా లోపలికి వెళ్లాడు. తమ గది... అంటే ఈ సంఘటన జరగక ముందుదాకా తనూ మహతీ వాడుకున్న గది రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఒకటే సింగిల్ కాట్ వుంది. వార్డ్‌రోబ్‌లో చూశాడు. తన బట్టలుగానీ వస్తువులుగానీ లేవు. అన్నీ మహతివీ, పిల్లలవే వున్నాయి. శలవు పెట్టి చేసిన పని ఇదన్నమాట అనుకుంటుంటే గది అవతల అడుగుల చప్పుడు వినిపించింది.

''మీ బట్టలవీ పిల్లల బెడ్‌రూమ్‌లోకి మార్చాను. నా గదిలోకి మీరు రాకండి,'' బైట నిల్చునే చెప్పింది. అతనికామెదంతా చిన్నపిల్లల వుక్రోషంగా అనిపించి అప్పటిదాకా ఆమెపట్ల ఏర్పడిన కోపం కొంత చల్ల బడింది.

''సారీ,'' చిన్నగా నవ్వి అని, ''పిల్లలేరి?'' అడిగాడు.

''హాస్టల్లో వేశాను,'' చెప్పింది.

అతను తెల్లబోయాడు. కోపం కట్టలు తెంచుకుని వచ్చింది. ''హాస్టల్లోనా? ఎందుకు? మనిద్దరం బతికే వున్నాం. రేప్పొద్దున్నే వెళ్లి తీసుకొచ్చెయ్,'' అన్నాడు. అతని గొంతు కఠినంగా మారింది.

''నేను ఎమ్‌ఫిల్‌కి అప్లయ్ చేశాను. పిల్లలతో నా చదువు కుదరదు.''

అతను కోపంతో వూగిపోయాడు. ''నువ్వు... నువ్వసలు ఆడదానివేనా?'' అరిచాడు.

''మీరసలొక మగవాడిలా, ఒక స్త్రీకి భర్తగా ప్రవర్తిస్తున్నారా? కార్యేషు దాసీ... అని సూక్తులు చెప్తారు. కానీ వాటికి ముందు మనువేం చెప్పాడో మీకక్కర్లేదు. ముందు ఉత్తమ సమాజాన్ని గురించి చెప్పాడు. తర్వాత ఉత్తమ పురుషుడెవరో చెప్పాడు. ఆ తర్వాతే స్త్రీ ధర్మాలు చెప్పబడ్డాయి. నాయకత్వ లక్షణాలు కలిగి, ధర్మ కార్యాలు చేసేవాడు, వినయ సంపన్నుడైనవాడు, నల కూబరుడంతటి గొప్ప ప్రేమికుడు- అలాంటివాడికి దాసిగా, మంత్రిగా, తల్లిలాగా, ప్రేయసిగా వుండగలుగు తుంది స్త్రీ. మరి మీరు? కట్టుకున్న దాన్నొదిలేసి ఎవర్నో వుద్ధరిస్తానంటున్నారు. ఇంత అనైతిక చర్యని నేను సహించలేను. దీన్ని నేను సమర్థిస్తే నా తర్వాత తరాని కిది అలవాటైపోతుంది. నా కొడుకుగానీ కూతురుగానీ మిమ్మల్ని ఎగ్జాంపుల్‌గా తీసుకోవటం నేను సహించ లేను. ఒక తల్లిగా వప్పుకోను,'' చాలా కటువుగా వుంది మహతి గొంతు.

తల గిర్రుమని తిరిగింది నిశాంత్‌కి. కాస్త తగ్గాడు.

''పిల్లల్ని హాస్టల్లో వేసి ఏం చేద్దామని?''

''ఎమ్మెస్సీ చేసి ఎమ్‌ఫిల్ చెయ్యాలనుకున్నాను పెళ్లవకముందు. మా నాన్న వద్దన్నారు. పెళ్లయ్యాక ఇల్లూ సంసారం బాధ్యతల్తో ఆ కోరికని పక్కకి నెట్టేశాను.''

''ఇప్పుడు చేస్తావా?'' దిగ్భ్రమగా అడిగాడు.

''ఏం? చెయ్యకూడదా?''

''మధ్యలో వాళ్లేం చేశారు?''

''వాళ్లుంటే వండి పెట్టటం, అన్నీ సిస్టమేటిక్‌గా చెయ్యటం నాకెలా కుదుర్తుంది?''

అతను వెర్రిగా చూశాడామెని. ఏం మాట్లాడాలో అర్థమవ్వలేదు. తను చేసినదానికి ఆమె ఇవ్వజూపిన కౌంటర్ ఇంత గట్టిగా వుంటుందనుకోలేదు. మళ్లీ అతనికే అనిపించింది. మగవాడు తనకే పిల్లల మీదికి మనసు పోతుంటే కన్నతల్లి ఆమెకి వుండదా? ఎన్నాళ్లు వాళ్లని వదిలిపెట్టి ఒంటరిగా వుండగలదు? అనుకుని,

''సర్లే అన్నం పెట్టు. నేను వెళ్లి వాళ్లని చూసి వస్తాను,'' అన్నాడు.

''మీకోసం వండలేదు. నాకోసమే వండుకు న్నాను. నా భోజనం కూడా అయిపోయింది,'' చాచిపెట్టి చెంప మీద కొట్టినట్టుంది మహతి జవాబు.

''మ...హ...తీ...'' దిగ్భ్రమగా, కొత్తగా ఆమెని చూసినట్టు చూశాడు.

''నేను రాననుకున్నావా? రావద్దనుకున్నావా?''

''వెడ్‌లాక్ బ్రేక్ చేసుకున్నాక మీకూ నాకూ ఏమిటి సంబంధం? నేను మీకోసం ఎందుకొండాలి? వండి ఎందుకు ఎదురుచూడాలి? ఆస్తి వ్యవహారాలు మనం ఇంకా సెటిల్ చేసుకోలేదు కాబట్టి ఇక్కడికి మీరు రావాలనుకున్నప్పుడు రండి. మీ ఏర్పాట్లు మీరు చూసుకోండి.''

నిశాంత్‌కి తల గిర్రుమని తిరుగుతున్నట్లయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఏడ్చి గొడవచేసే ఆడవాళ్ల గురించి విన్నాడు. సూసైడ్ కమిట్ చేసేవాళ్ల గురించి తెలుసును. కానీ ఇంత రివెంజిఫుల్‌గా ఆలోచించి ఏటికి ఎదురీదే మనస్తత్వాన్ని చూడటం ఇదే మొదటిసారి. మహతి

సహజంగానే చాలా బోల్డ్‌గా బేలన్స్‌డ్‌గా వుంటుంది. ఇప్పుడు ఆమె బోల్డ్‌నెస్ యొక్క కడపటి అంచుని చూస్తున్నాడతను. పూర్తిగా అపరిచితురాలిలా అనిపించింది. ఇంక ఆ ఇంట్లో వుండలేకపోయాడు.

పిల్లల దగ్గరికి వెళ్లాలనిపించింది. మనసెంతగానో ఆరాటపడింది. ప్రీతీ, వంశీ ఎప్పుడేనా తమిద్దరినీ వదిలిపెట్టి వున్నారా? ఎందుకు మహతి వాళ్లని దూరం చేసుకుంది? ఎవరి మీద కోపం ఇది? అతనికి అంత దాకా సొఫిస్టికేటెడ్‌గా కనిపించిన మానవ సంబంధాలు, వివాహవ్యవస్థ పైపై పొరలన్నీ చిరిగిపోయి లోపల ముతగ్గా వున్నదేదో కనిపిస్తున్నట్టనిపించింది.

టైము చూసుకోలేదు. హాస్టల్‌కి వెళ్లాడు. లైట్లన్నీ ఆఫ్ చేసి వున్నాయి. అప్పుడు చూశాడు చేతి వాచీలోకి. రేడియం డయలు మెరుస్తూ పదకొండు చూపిస్తోంది. నిరాశగా స్కూటర్‌ని ప్రసన్న ఇంటివైపు మళ్లించాడు.

"ఏమైంది? మళ్లీ ఏదైనా గొడవా?" అడిగింది ప్రసన్న వాడిపోయి వున్న అతని ముఖం చూసి.

"పిల్లల్ని హాస్టల్లో వేసింది మహతి."

అతను తీసుకున్నంత సీరియస్‌గా ఆ విషయాన్ని తీసుకోలేదు ప్రసన్న.

"సో వాట్? ఆమెకలా నచ్చింది. చేసింది. దానికి నువ్వెందుకింత వర్రీ అవటం?" అడిగింది చిత్రంగా చూస్తూ.

"ఎందుకేమిటి? వాళ్లు నాకూ పిల్లలే. నాతో ఒక్క మాటేనా చెప్పకుండానా?"

"ఎందరు పిల్లలు హాస్టల్స్‌లో లేరు?"

"వాళ్లూ నా పిల్లలూ ఒకటేనా? షీ యీజే ఫూల్... షీయీజేన్ ఇడియట్... షీ... షీ యిజ్ ఎవ్విరి నాన్సెన్స్" కుర్చీలో కూలబడి అశాంతిగా చేతుల్లో ముఖం దాచుకున్నాడు. ప్రసన్న మనసు ఆర్ద్రమైంది. అతని దగ్గిరగా వెళ్లి జుత్తులో వేళ్లు జొనిపి తలని తన పొట్టకి ఆనించుకుంది.

"అక్కడేమైనా తిన్నావా నిశాంత్?" అడిగింది రెండు నిముషాలాగి.

"ఆకలి లేదు."

"నేను వండుకోలేదు. రెండు యాపిల్సు లాగించి పాలు తాగాను. నీకూ ఇవ్వనా? ఎటేనా వెళ్దాం," అంది.

"ఇంత రాత్రా?" తెల్లబోయాడు.

"పబ్‌కెళ్దాం. లేకపోతే రాత్రంతా మూడ్ ఆఫ్‌గానే వుంటావు. దాన్ని భరించే ఓపిక నాకు లేదు," అంది ప్రసన్న. అనటమేమిటి అతన్నొదిలేసి వెళ్లి పళ్లు కట్‌చేసి తెచ్చి ముందు పెట్టింది. నాలుగు ముక్కలు తిని లేచాడు.

ఇద్దరూ బైటికొచ్చారు. వస్తూ అంది ప్రసన్న, "ఒక మాట చెప్పనా నిశాంత్?"

ఏమిటన్నట్టు చూశాడు.

"నీ జీవితం నీదని వచ్చేశావు. ఆమె జీవితం ఆమెదని వదిలెయ్. లేకపోతే మనశ్శాంతి వుండదు."

"మామధ్యని పిల్లలు నలిగిపోతున్నారు ప్రసన్నా! అసలు తనకింత మూర్ఖత్వమేమిటి?"

"ఇందులో పిల్లలకి ఇబ్బందేం వుంటుంది? మనం ఇబ్బంది, ఇబ్బందని పదేపదే అంటుంటే వాళ్లకి ఇబ్బందనిపిస్తుంది. లేకపోతే ఎడ్జస్టయిపోతారు. ఒకవేళ ఆమె మళ్లీ పెళ్లి చేసుకున్నా వాళ్లకో ఇండిపెండెంట్ లైఫ్‌స్టయిల్ ఏర్పడుతుంది. ఆమె నువ్వనుకున్నదాని కన్నా తెలివైనది."

చేదు తిన్నట్టయిందతనికి. మహతి మళ్లీ పెళ్లి చేసుకోబోతోందా? అందుకే పిల్లల్ని దూరం చేసిందా? పెళ్లి చేసుకుని మళ్లీ పిల్లల్ని కని- అసహ్యంగా అనిపించింది. ఆమె మళ్లీ పెళ్లి చేసుకోబోవటంకాదు. పిల్లల్ని కనబోవటమూ కాదు. వున్న పిల్లల్ని బాధ్యతారహితంగా వదిలెయ్యటం.

తెల్లారి మూడింటిదాకా పబ్‌లోనే వున్నారు. శరీరం, మనసూ సమన్వయం లేకుండా దేని పని అది చేసుకుపోయాయి.

*

రాత్రంతా దాదాపు నిద్ర లేకుండా గడిపినా పొద్దునే లేచి తయారై ఎనిమిదింటికల్లా పిల్లల హాస్టల్లో విజిటర్స్‌లాంజ్‌లో వున్నాడు నిశాంత్.

ప్రీతీ, వంశీ వచ్చారు. అతను భయపడ్డట్టు వాళ్లేం తల్లడిల్లిపోవటం లేదు. ఛీర్‌ఫుల్‌గా వున్నారు.

"హౌ ఆర్యూ డేడీ?" అనడిగారు.

ఇద్దర్నీ ఒక్కసారే దగ్గరకి తీసుకన్నాడు నిశాంత్. కళ్లమ్మట నీళ్లొచ్చాయి.

"మీకిక్కడ బావుందా?" అడగలేక అడిగాడు.

"సో నైస్ డేడీ. బట్ వియార్ మిస్సింగ్ యూ బోత్," అంది ప్రీతి ఆరిందాలా.

"అమ్మ మీతో ఏం చెప్పింది?"

"నువ్వు ఇంకో ఆంటీ ఇంట్లో వుంటున్నావట కదా? మమ్మల్ని డ్రాప్ చెయ్యటం, మళ్లీ యీవెనింగ్ టైముకి పికప్ చేసుకోవటం అదీ తనకి ఇబ్బందిగా వుంటుందని హాస్టల్లో చేర్చానంది."

నిశాంత్ మరొక్క మాట కూడా మాట్లాడలేదు. పిల్లల దగ్గర కూడా ఓపెన్‌గా చెప్పేసింది మహతి. ఈ విషయాన్ని స్కూల్ ప్రిన్సిపాల్‌తోటీ చెప్పే వుంటుంది. చాలా సెన్సిటివ్ ఇష్యూ. దాన్ని పబ్లిక్ చేసేసింది. ఏం

చెయ్యాలామెని? ఏం చెయ్యగలడసలు ఒక స్త్రీ తెగబడితే మగవాడు ఏమైనా చెయ్యగలడా? తనేనా చావాలి. ఆమెనైనా చంపాలి. అంటే ఇంకో మెట్టు దిగజారాలి. చాలా డెస్పరేట్‌గా అనిపించింది.

ఇంతలో బెల్ మోగింది.

"మాకిప్పుడు బ్రేక్‌ఫాస్ట్ అవర్ డేడీ!" అంటూ పిల్లలు తూనీగల్లా పరిగెత్తారు. వాళ్ల సంతోషం చూశాక అతనికి కొంత రిలీఫ్‌గా అనిపించింది. కానీ ఇది లోకం తెలీని సంతోషం. వీళ్లు పెద్దవాళ్లయ్యాక తమకి జరిగిన అన్యాయం గురించి నిలదీసి అడగరా? అంటే తను ప్రసన్నని వదిలేసి మళ్లీ మామూలు జీవితంలోకి వెళ్లిపోవటం ఒకటేనా దారి? ఆ దార్లోకి తనని మళ్లించడానికే మహతి ఇదంతా చేస్తోందా? ఇంత జరిగాక ఆమెతో వెనకట్లా తను కలిసి వుండగలడా? తన ఫీలింగ్స్, ప్రాబ్లమ్స్, ఆబ్లిగేషన్స్ పట్టని ఆమెతో! అయినా తను ప్రసన్నని ఎందుకొదిలిపెట్టాలి? ఆమెకి బిఫోర్ మేరేజ్ ఫ్రెండ్సు లేరా? ఆ అమ్మాయిల్తో తిరుగుతుంది. ఫ్రెండ్షిప్ కీపప్ చేస్తుంది. ప్రసన్న, తను ఆపోజిట్ సెక్స్ కావటంతో మామూలు ఫ్రెండ్‌షిప్‌ని అధిగమించిన ఆకర్షణ ఏర్పడింది. దానికంత గొడవా? మహతి ప్రవర్తన చాలా మీన్‌గా అనిపించిందతనికి.

చాలాసేపు అక్కడే కూర్చున్నాడు ప్రీతీ, వంశీ మళ్లీ వస్తారేమోనని. వాళ్లింక రారని ఆయా చెప్పింది. వచ్చేశాడు.

*

మహతి డైవోర్స్ అడిగింది.

నిశాంత్ వప్పుకోలేదు.

"మ్యూచ్యువల్ కన్సెంట్ మీదైతే ఈజీగా వస్తుందని అడిగాను. నువ్వొప్పుకోకపోతే ఎడల్టరీ కేసు వేస్తాను. నా దగ్గిర అన్ని ఆధారాలూ వున్నాయి," నిర్మొహమాటంగా చెప్పింది.

అతనికి చిమ్మచీకట్లో వూపిరాడనిచోట ఇరుక్కుపోయిన భావన కలిగింది. ముందుకి వెళ్లలేడు. వెనక్కి తిరిగి రాలేడు. అసలెటు వెళ్తున్నాడో కూడా తెలీదు. అలాంటి పరిస్థితి.

"ఏమాశించి ఇదంతా చేస్తున్నావు మహతీ?" అసహాయత వలన ముంచుకొస్తున్న కోపంతో అడిగాడు.

"కెరీర్," తొణక్కుండా జవాబిచ్చింది. "నేను పెళ్లికీ కెరీర్‌కీ ఈక్వల్ ఇంపార్టెన్సిచ్చాను. పెళ్లి ఫ్లాపైంది. మిగిలింది కెరీరొక్కటే."

"పిల్లల కన్నా కెరీర్ ముఖ్యమా?"

మహతి విసుగ్గా చూసింది. "వాళ్లకి నేనేదో అన్యాయం చేసినట్టు మాట్లాడతావేమిటి? ఈ సమస్యల వలయంలోకి వాళ్లని కూడా లాగాలా? నీకోసం మేమంతా ఏడుస్తూ ఎదురుచూస్తూ వుంటే నీకు బావుంటుందా?"

"మహతీ! ఇప్పటికీ నేనదే చెప్తున్నాను. గోరంత దాన్ని కొండంతగా చేస్తున్నావు. ఏ మగవాడూ మడి కట్టుకుని కూర్చోడు. అలా వున్నాడంటే అదొక మిడిల్ క్లాస్ ఎడ్జెస్ట్‌మెంట్. అంతే! దయచేసి నన్నర్థం చేసుకో. నా మాట విను. ఇదివరకట్లా వుందాం," ఆమె దానికి బదులుగా ఏమంటుందో తెలిసీ అన్నాడు. ఆమె అదే అడిగింది. పదేపదే ప్రసన్నని తమ మధ్య నుంచీ తప్పించమంటుంటే అతనికి కోపమొస్తోంది. కంట్రోల్ తప్పిపోయాడు.

"ప్రసన్నని వదిలిపెట్టే ప్రసక్తి లేదు. కావాలంటే నీకు నచ్చినవాడితో నువ్వు తిరుగు. అదే కదా నువ్వు కోరుకునేది?" అన్నాడు.

అసహ్యంగా చూసింది మహతి. "నువ్వు గడ్డి తిన్నావని నేనూ తిని నీతో నా సమానత్వాన్ని నిరూపించుకోనక్కర్లేదు. మిస్టర్ నిశాంత్! నీకు తోచింది నువ్వు చేశావు. నేనేం చెయ్యాలో కూడా నువ్వే నిర్దేశించక్కర్లేదు. నాకు నచ్చిన మంచి నేను చేస్తాను. అది నచ్చకపోతే వాళ్లని నువ్వు తీసికెళ్లి పెంచి పెద్ద చెయ్యి. నాతో సమానంగా నీకూ బాధ్యత వుంది," అంది కటువుగా.

నిశాంత్ వెనక్కి తగ్గాడు. పిల్లల్ని తీసుకుని ఆమెని ఏడిపించాలని లోపల్లోపల ఎంతగా అనిపించినా వాళ్ల బాధ్యత ప్రసన్న తీసుకుంటుందనే ఆశ అతనికెంత మాత్రం లేదు. నిస్సహాయంగా మహతి కేసి చూడటం మినహా తనకి మరే ఛాయిసూ లేదన్న విషయం చాలా స్పష్టంగా అర్థమైంది.

ఒక స్త్రీ ఎలాంటి సెంటిమెంట్స్‌కీ లోబడకుండా నిలకడగా ఆలోచిస్తే, ఆమెకి అన్యాయం జరిగినప్పుడు ప్రతిఘటిస్తే అలాంటి ప్రతిఘటన జీవితాలని తలక్రిందులు చెయ్యగలదన్న స్పృహ చాలా ఆలస్యంగా కలిగిందతనికి.

*

మహతి తల్లీతండ్రీ ఆమెకి చాలా మోరల్ సపోర్ట్ ఇచ్చారు. అక్కడికీ మహతి నాయనమ్మ "విడాకులెందుకు? అదేం మళ్లీ పెళ్లి చేసుకోబోతోందా? ఇద్దరు పిల్లల తల్లి. మగదక్షత లేకుండా వాళ్లని పెంచి పెద్ద చెయ్యటం సాధ్యపడేనా? తెగేదాకా తెంచుకోవడం ఎందుకు? ఎప్పటికో ఒకప్పటికి అతను మనసు మార్చుకుని తిరిగిరాడా?" అంటూనే వుంది.

"ఎదిగిన పిల్లల వ్యక్తిగత జీవితాల్లోకి మనం తల దూర్చకూడదు. వాళ్లకి మన సహకారం ఎంతవరకూ

అవసరమో అంతవరకూ ఇస్తే సరిపోతుంది,'' అనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు వాళ్లు. వాళ్లకి మహతికాక ఒక కొడుకు. బెంగుళూర్‌లో సిస్టమ్స్ ఎనలిస్ట్. చెల్లెల్ని పూర్తిగా సమర్థించాడు.

''మహతి మాట్లాడకుండా వూరుకుంటే బావ చేసిన పనిని సమర్థించినట్టే. తప్పు ఒప్పై పోతుంది. వంశీ రేప్పొద్దున్న ఆయన దార్లోనే నడిస్తే? ఆ ప్రసన్న లాగే ప్రీతి కూడా పెళ్లీ గిళ్లీ అక్కర్లేదంటే? వీళ్లు తప్పు చేస్తూ పిల్లల్ని తప్పు చెయ్యద్దంటే వూరుకుంటారా?'' అన్నాడు మహతి మనసు చదివినట్టే.

*

ఒక సంఘటన జరిగేటప్పుడు ఆ సంఘటన యొక్క బిల్డింగ్ ఫేక్టర్‌గా ఏ క్షణం విలువ దానిదే. అదే ఆ సంఘటన జరిగాక రోజులు, సంవత్సరాలు దాని మీద దుమ్ముకణాల్లా పేరుకుపోతాయి.

*

మహతి ఎమ్‌ఫిల్ చేసి, వున్న జాబ్ వదిలేసి ముంబైలోని ఒక మల్టీ నేషనల్ ఫార్మస్యూటికల్ కంపెనీలో బయోకెమిస్ట్‌గా చేరటం, పిల్లల్ని లండన్ షిఫ్ట్ చేసి తను కొన్ని ఫారిన్ ఎసైన్‌మెంట్స్ టేకప్ చెయ్యటం, లండన్ బేస్‌గా చేసుకుని తను జర్మనీ, స్విట్జర్లాండ్‌లాంటి దేశాల్లో తిరగటం... ఒక కొత్త ప్రపంచంలో పడిపోయింది. సరిగ్గా అవే బయో కంప్యూటర్స్ శకం మొదలౌతున్న రోజులు. ఆమె ఆ లైన్లో బిజీ అయింది.

ఆమె లండన్‌లో మొదటిసారి అడుగుపెట్టినప్పుడు కంపెనీ తరఫున రిసీవ్ చేసుకోవటానికి వచ్చి పరిచయమైనవాడు ఆండ్రూ అండర్సన్.

*

పాత షర్టు విడిచి, కొత్త షర్టు తొడుక్కున్నంత ఈజీగా ప్రసన్న జీవితంలో ఇమిడిపోయాడు నిశాంత్. మనసులో అపరాధభావం ఏదైనా ఉందంటే మహతిని తప్పుపట్టడంలో అది కొట్టుకుపోయింది. ఇల్లూ, బేంకు బేలన్సూ ఆమెకే వదిలేసి తనని మరికొంత సమర్థించుకున్నాడు.

ఏ మగవాడేనా కోరుకునేలాంటి జీవితం... బాధ్యతల్లేవు. కావాలనిపిస్తే వండుకోవటం, లేకపోతే బైట తినేసి రావటం, ఫ్రెండ్సు, పార్టీలు, డ్రింక్సు, పబ్స్... రంగులర్నాటంలో గిర్రుమని తిరుగుతున్నంత వుత్సాహంతో వుక్కిరిబిక్కిరౌతున్నాడు.

మహతి, తను భార్యాభర్తలుగా వుండిన రోజులు గుర్తొచ్చాయి. పొద్దున్నే హడావిడిగా లేవటం, అదో బాధ్యతగా మహతి వండటం, తను హెల్ప్ చెయ్యటం, పిల్లల్ని తయారుచెయ్యటం, పిక్చర్‌కి వెళ్లాలంటే అదో వార్షిక ప్రణాళిక... షీర్ రొటీన్! మధ్యమధ్య విసుగులు... అలకలు... కోపాలు... చికాకులు... జీవితమంటే యింతేనా అనిపించేంత నిరాసక్తత!

అదే తను ఇప్పుడెంత యాక్టివ్‌గా వున్నాడు. మహతికి లైఫ్ ఎంజాయ్ చెయ్యటం రాదు. ప్రసన్నకి వచ్చును. అందుకే ఈ మార్పు! అనుకున్నాడు.

*

కాలం రంగులరాట్నమే. బాల్యంలో మెల్లగా మొదలుపెట్టి యౌవనంలో వూపందుకుని, పెద్దతనం వచ్చేసరికి వడి తగ్గి ఆగిపోయే రంగులరాట్నం. దాని వేగం తగ్గుతుండటాన్ని నిశాంత్‌గానీ, ప్రసన్నగానీ ఇంకా గుర్తించలేదు. చుట్టూ వున్న సొసైటీలో ఒక నిర్దుష్టమైన మార్పు... ఒక్కసారిగా వచ్చినది కాదు. క్రమేపీ వచ్చినది.

కొన్నాళ్ల దాకా మహతి విషయాలు పట్టించుకున్నాడు నిశాంత్. ఇంకొంతకాలం కేజువల్‌గా తెలిశాయి. కేర్‌నాట్ అనుకున్నాడు. సెటిల్డ్ లైఫ్‌లోంచి సుడిగుండంలో పడి, మళ్లీ దారి వెతుక్కుంటున్న తరుణాన ఆమె దగ్గిర్నుంచీ లెటరు- పదేళ్లు గడిచాక.

పిల్లలు మిమ్మల్ని చూడాలనుకుంటున్నారు. ప్రసన్నగారికి అభ్యంతరం లేదంటే, మీకు వీలౌతుందంటే పంపిస్తాను. క్లుప్తంగా చాలా చిన్న వుత్తరం.

జ్ఞాపకాల మీద పేరుకున్న దుమ్ము మేఘంలా లేచింది. ఏం జరిగింది? వున్నట్టుండి పిల్లల్ని ఇక్కడికి పంపించాలన్న నిర్ణయం ఎందుకు తీసుకుంది? అతని భృకుటి ముడిపడింది. ఉత్తరాన్ని ప్రసన్నకి చూపించాడు.

''మధ్యలో నాకెందుకు అభ్యంతరం? రమ్మని రాయి. వద్దనెందుకనాలి?' అంది. అతనలాగే చేశాడు.

ప్రీతీ, వంశీ వచ్చారు. ముంబై ఏర్‌పోర్ట్‌లో వాళ్లని రిసీవ్ చేసుకున్నారు నిశాంత్, ప్రసన్న. నిశాంత్ వూహించలేనంత మార్పు వాళ్లలో. తెల్లగా, పొడుగ్గా ఆరోగ్యంతో మిసమిసలాడుతున్నారు. కళ్లల్లో ఉత్సాహం తొణికిసలాడుతోంది. వాళ్లెలా వున్నారో, ఎలాంటి స్థితిలో తను చూడబోతున్నాడో అని ఆదుర్దాపడిన అతని మనసు మూగవోయింది. ఇద్దర్నీ చెరో చేత్తోనూ దగ్గరకి తీసుకున్నాడు.

మహతి గురించి అడగలేదు నిశాంత్. వాళ్లూ చెప్పలేదు. కానీ వాళ్లని చూస్తుంటే మాత్రం ఆమెని లోపల్లోపలేనా అప్రీషియేట్ చెయ్యకుండా వుండలేకపోయాడు.

నలుగురూ హైద్రాబాదొచ్చారు ప్రసన్నతో నిశాంత్ కలిసుండే ఇంటికి. పిల్లల మనసుల్లో ఏముందో

నిశాంత్ పట్టుకోలేకపోయాడు. ఇంత వున్న పళంగా ఎందుకొచ్చారో కూడా వూహించలేకపోయాడు. అసలంత లోతుగా ఆలోచించడానికి అతనికి వ్యవధి ఎక్కడ? వాళ్ల కబుర్లు... చిన్నచిన్న ఔటింగ్స్... కాలం కళ్లెం తెంచుకు పరిగెడుతున్నట్లనిపించింది.

లండన్‌లోని వాళ్ల ఫోటోలు చూపిస్తున్నారు. అక్కాతమ్ముళ్లిద్దరూ. ఫ్రెండ్స్‌తో తీయించుకున్నవీ, వీళ్లిద్దరే కలిసి తీయించుకున్నవి. సడెన్‌గా ఆగిపోయాడు నిశాంత్.

రెండేళ్ల చిన్న పాప... రబ్బరుబొమ్మలా వుంది. వంశీ, ప్రీతి చెరో చెయ్యీ పట్టుకుని నడిపిస్తున్నారు.

"ఇది బెట్టీ నాన్నా! బెట్టీ నిరుపమా అండర్సన్. మాకు చెల్లెలవుతుంది. ఒకటే అల్లరి చేసి విసిగిస్తుంది. అమ్మని వూపిరి పీల్చుకోనివ్వదు. మిస్టర్ ఆండ్రూ అండర్సన్ మొదట్లో చాలా భయపడేవాడు. మేము జెలసీతో దీన్నేమైనా చేస్తామేమోనని," ప్రీతి చెప్తుంటే నిశాంత్ ముఖంలో రంగులు మారసాగాయి. వంశీ, ప్రసన్న ఫోటోలు చూడటంలో బిజీగా వున్నారు. వాళ్లతని ఫీలింగ్స్ కాచ్ చెయ్యలేదు.

ప్రీతి గమనించినా గమనించనట్టే చెప్తూకు పోయింది. "... అతనికిప్పుడు మామీద నమ్మకం ఏర్పడి పోయింది. మమ్మల్ని ఇంటికొచ్చేసి వాళ్లతోనే స్టే చెయ్యమని అడుగుతున్నాడు. అమ్మ అతన్ని అంకుల్ అనాలని చెప్పింది. ఎదురుగా అలా పిలిచినా పేరు పెట్టే చెప్తాం ఎవరికేనా. మిస్టర్ ఆండ్రూ చాలా నైస్ పర్సన్. అసలు అతన్ని మేరేజి చేసుకున్నాకే అమ్మ మళ్లీ నవ్వటం మొదలుపెట్టింది. బెట్టీ గాళ్ పుట్టాకైతే మామూలుగా అయిపోయింది. మా చిన్నప్పుడెలా వుండేదో అలాగే వుంటోంది. వియార్ వెరీ థేంక్‌ఫుల్ టూ దట్ అంకుల్... వియ్ గాట్ అవర్ మామ్ బేక్," ప్రీతి మాటల్లోనూ, గొంతులోనూ సంతోషం.

మహతి మళ్లీ పెళ్లి చేసుకున్న విషయాన్ని ప్రసన్న సీరియస్‌గా తీసుకోలేదు. ఇలా జరుగుతుందని మొదటే అనుకుంది. అలాగే జరిగింది.

"బెట్టీ అచ్చం బ్రిటిషర్‌లాగే వుంటుంది. పేల్ వైట్, కర్లీ హెయిర్, బ్లూ ఐస్... చాలా గమ్మత్తుగా వుంటుందిగానీ బాగా అల్లరిది..."

నిశాంత్ అక్కడ్నుంచి లేచి వెళ్లిపోయాడు.

"తన విషయాలేం చెప్పద్దని అమ్మ చెప్పలా నీకు?" వంశీ ప్రీతిని కోప్పడ్డాడు.

"అమ్మ గురించి నాన్నకి కాకపోతే యింకెవరికి చెప్తాం?" అడిగింది ప్రీతి.

ప్రసన్న ఇద్దర్నీ ఒకసారి చూసి నిశాంత్‌ని వెతుక్కుంటూ వెళ్లింది. అతను టెర్రస్ మీద వున్నాడు. సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ వుద్వేగాన్ని ఆపుకునే ప్రయత్నం చేస్తున్నాడు. వెనగ్గా వెళ్లి అతని భుజం మీద చెయ్యేసింది ప్రసన్న.

"పిల్లలు... చాలా బావున్నారు నిశాంత్! నువ్వొచ్చేశాక వంశీ ప్రీతిని కోప్పడ్డాడు అక్కడి విషయాలు యిక్కడెందుకు చెప్తున్నావని. దానికా పిల్ల ఏమందో తెలుసా? అమ్మ గురించి నాన్నకి కాక యింకెవరికి చెప్తాం అంది. నిశూ! వాళ్లని చూస్తుంటే నేనేం పోగొట్టుకున్నానో అర్థమౌతోంది... అలా నా గురించి ఎవరూ ఎవరికీ చెప్పరు కదా?" అంటూ అతని భుజం మీద తలానించి ఏడ్చేసింది.

సగం కాలిన సిగరెట్‌ని విసిరేశాడు నిశాంత్.

"ఏమిటిది ప్రసన్నా? నువ్వింత డిస్టర్బ్ అవుతావంటే రావద్దని రాసేవాడిని. ప్లీజ్... ఏడవకు... పద కింది కెళ్దాం. వాళ్లుగానీ ఇక్కడికొస్తే బాగుండదు," అంటూ ఆమెని ఓదార్చి తీసికెళ్లాడు.

ఆ సాయంత్రం రవీంద్రభారతిలో డాన్స్ ప్రోగ్రాంకి తీసికెళ్లాడు నిశాంత్ అందర్నీ!

ఆ రాత్రంతా నిశాంత్‌కి కలతనిద్రే అయ్యింది. బెట్టీ అండర్సన్ కల్లోనే వుంది. నీలికళ్ల, తెల్లవొంటి ఆ యిండో-ఆంగ్లియన్ పిల్ల తన గుండెల మీద పరుగులు పెడ్తూ వుంటే మహతి పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టే వుంది. మహతి ముఖం కనిపించలేదు. లీలగా ఆమె ఆకృతి మాత్రమే కలలో కదిలింది. ఆమెని వొక్కసారి చూడాలనే ఆరాటం అతన్ని నిలవనివ్వలేదు.

అన్నీ మర్చిపోయి ఎలా పెళ్లి చేసుకోగలిగింది? ఆమె చాలా మూర్ఖంగా ప్రవర్తించిందనే తను ఇన్నాళ్లూ అనుకున్నాడు. కానీ తనని తృణీకరించి ఎంత తెలివైన అడుగేసింది? లేకపోతే అసహనంతో, అశాంతితో రగిలిపోతూ ఆమె... ఆమెకీ ప్రసన్నకీ మధ్య నలుగుతూ, తను తమ ముగ్గురి మధ్యా నలుగుతూ పిల్లలు... అంతా బాగానే వుందిగానీ యీ పెళ్లి? మళ్లీ ఎప్పటికీ కలుసుకోలేనంతగా తమ దారులు చీలిపోయాయనిపించి అతని గుండె పిండినట్లయింది. ఒక మమకారాన్ని తెంచుకోవటంలో ఎంత బాధ వుంటుందో అతనికి అనుభవంలోకి వచ్చింది. ప్రసన్నని మొదటిసారి వదులుకున్నప్పుడు కూడా యింత బాధ కలగలేదు.

అటు నిద్రా, యిటు మెలకువా కాని స్థితిలో వున్న అతన్ని ప్రసన్న గమనిస్తూనే వుంది. మనసులో ఎంతో అపరాధభావన!

''మన ప్రేమని నిలబెట్టడానికి చాలా మూల్యం చెల్లించావు నిశాంత్!'' అంది అతని దగ్గిరగా జరిగి గుండెల్లో తల దాచుకుంటూ.

*

ప్రీతీ, వంశీ పదిరోజులున్నారు నిశాంత్ దగ్గర. బెంగుళూర్‌లో వుండే మేనమామ దగ్గరికి బయల్దేరారు.

వాళ్లు సామాన్లు సర్దుకుంటుంటే ఏదో పోగొట్టు కుంటున్నట్టే అనిపించింది నిశాంత్‌కి.

''అక్కడేముందని మీరు తిరిగి లండన్ వెళ్లటం? ఆమె తన దారి తను ఏర్పరుచుకుంది. పరాయివాళ్ల లాగా ఎందుకక్కడ? ఇక్కడ వుండిపోండి,'' అన్నాడు.

''అదెలా కుదుర్తుంది? మేం తిరిగొచ్చేస్తామని మిస్టర్ ఆండ్రూకి ప్రామిస్ చేశాం. అమ్మకి అసలలాంటి అనుమానమే రాలేదు. రిటర్న్ టికెట్ కూడా కన్‌ఫమ్ చేసి పంపింది. మేమక్కడ చాలా హేపీగా వున్నాం నాన్నా! నువ్వక్కడ మాతో లేకపోవడం బాధనిపించినా, ఎక్కడో ఒకచోట వుండి మా గురించి ఆలోచిస్తావనే భావన చాలా సంతోషాన్ని కలిగిస్తుంది,'' అంది ప్రీతి.

''నువ్వంటే అమ్మకి గౌరవమే నాన్నా! ఇండియన్ హజ్బెండ్స్ అందరిలా కాకుండా నువ్వు తనని హెరాస్ చెయ్యలేదనీ, అడగ్గానే డైవోర్స్ యిచ్చావనీ, మమ్మల్ని కూడా క్లెయిమ్ చెయ్యలేదనీ చెప్తుంది నాన్నా!'' అని కూడా అంది.

నిజమే! మహతి మనుషుల్ని ద్వేషించడం నేర్పించలేదు తన పిల్లలకి. సమస్య ఎదురైనప్పుడు... లేదా అన్యాయం జరిగినప్పుడో దానికి కారణమైన వాళ్లని ద్వేషించడం కన్నా వీలైన పరిష్కారాన్ని వెతుక్కో వడం, లేకపోతే తప్పుకుపోవటాన్నీ నేర్పింది. తన మనసునిండా పరుచుకున్న దుఃఖపు నీడల్ని వాళ్లదాకా సాగనివ్వకుండా దూరంగా వుంచి పెంచింది.

నిశాంత్ ప్రీతి మాటల్ని విని నిర్వేదంగా నవ్వు కున్నాడు.

ప్రీతినీ, వంశీనీ బెంగుళూరు ఫ్లైట్ ఎక్కించి వచ్చి బిర్లా టెంపుల్‌లో ఆరుబయట కూర్చున్నారు ఇద్దరూను. దీపాల వెలుతుర్లో నౌబత్‌పహాడ్ కింద వూరంతా కరుగు తోంది. వెన్నెల పల్చగా పరుచుకుని వుంది.

ఇంటికెళ్లాలని ఇద్దరికీ అనిపించటంలేదు. గత కొద్దికాలంగా తమ మనసుల్లో గూడు కట్టుకుని వున్న వంటరితనం ప్రీతీ, వంశీలొచ్చి వెళ్లిన యీ రాత్రి బహిర్గతమైంది.

''ఇల్లంటే నాలుగ్గోడలు. గోడలని ప్రేమించ రెవరూ. వాటిని అనుసంధానించుకుని వుండే అను బంధాలని ప్రేమిస్తారు. పెళ్లీ అలాంటిదే. గోడల్ని ప్రేమించనట్టే పెళ్లినీ ఎవరూ ప్రేమించరు. ఏవరేజి మగవాడిలాగా మహతి అలా ప్రేమిస్తూ ఉండాలని ఆశించాను. వాస్తవం ఏమిటో ఆమెకి తెలుసు గాబట్టి ఆ గోడల్ని ఛేదించుకుని వెళ్లిపోయింది,'' అన్నాడు నిశాంత్, మహతి నుంచి విడిపోయిన యిన్నాళ్లకి ఆమె మనసేమిటో అర్థమయ్యి. అసలందుకే ఆమె పిల్లల్ని పంపించి వుంటుందని కూడా గ్రహించాడు.

''మనం ఇప్పుడేం చేద్దాం?'' ఉన్నట్టుండి అడిగింది ప్రసన్న.

ఆ ప్రశ్న మొదట అసంబద్ధంగా అనిపించినా తర్వాత దాని లోతు తెలిసి గుండె ఝల్లుమంది నిశాంత్‌కి. పెళ్లిలేదు. పిల్లల్లేరు. ఎత్తుకున్న బాధ్యతల్లేవు. దింపుకోవాల్సిన బరువుల్లేవు. వయసులో వున్నప్పుడు కళ్లెంలేని గుర్రంలా పరిగెత్తిన కాలం ఇప్పుడు ఆగాగి నత్తనడక నడుస్తోంది.

పబ్స్‌కీ, పార్టీలకీ తిరిగిన ఫ్రెండ్సంతా పిల్లల పెళ్లిళ్లు, వాళ్ల కెరీర్ బిల్డింగ్‌లో తల మునకలుగా వున్నారు. తామిద్దరూ ఎక్కడికెళ్లినా... అక్కడంతా యూత్ ఆక్రమించుకుని వున్నారు. తమకి ఆంటీ, అంకుల్ ప్రమోషన్ ఇచ్చేశారు. వాళ్లతోనేనా కలవాలని తామనుకున్నా కలుపుకోవాలని వాళ్లకి వుండదు.

అందుకే వుత్పన్నమైందా ప్రశ్న.

''వీ షల్ బీ లివింగ్ టుగెదర్ అన్ టూ డెత్,'' అన్నాడు నిశాంత్ లేచి నిలబడి ఆమె చెయ్యందు కుంటూ. అందులోని బిట్టర్‌నెస్ అర్థమై కళ్లలో నీళ్లు తిరిగాయి ప్రసన్నకి. లేచి అతన్ననుసరించింది. వాళ్ల వెనుకే వంటరితనం కూడా.

*విపుల మాసపత్రిక, ఆగస్ట్ 2003*

